# ఈ పయనం ఆగదు..!

-కోలపల్లి ఈశ్వర్

నీకేం కావాలి? ఎందుకీ అసంతృప్తి? ఏమిటీ నిర్వేదం? దేనికి నిరాశ?- ఈ ప్రశ్నలు ఎవరడిగారో గుర్తులేదు. ప్రశ్నలు గుర్తున్నాయి. సమాధానాలు స్ఫురించవు. నన్ను నేను అస్సలు నమ్మను. నాలో రెండు మెదళ్ళు వున్నాయేమోనని నా అనుమానం. ఇకపోతే నా ఈ వ్యాఖ్యకు నిదర్శనంగా కొన్ని సంఘటనలు జ్ఞప్తికి వస్తున్నాయి.

"నీ బావను. నన్ను చూసి పారిపోతావేం? సిగ్గా? చిరాకా?" ఈ మాటలు నేనే అన్నానా రోజు నా మరదలు లలితతో. అప్పటికి లలిత వయస్సు పదిహేను.

"ఆ రెండూ కాదు.. భయం" అంది లలిత గదిలో దూరి తలుపులు బిడాయించుకుని కిటికీలోనుంచి చూస్తూ.

"భయం దేనికి? నేనేమైనా రాక్షసుడ్నా? విలన్నా?"

"కాదు. నువ్వు మగాడివి. ఒంటరిగా దొరికానుకదాని నా వెంట పడుతున్నావు. నువ్వు ఎవ్వరైతే ఏం? నువ్వు మంచివాడనుకున్నాను. కానీ కాదు. అందుకే నిన్ను చూస్తే నాకు భయంగా వుంది."

"నువ్వు సినిమాలూ, టీవీ ప్రోగ్రాములూ చూడ్డం లేదూ? తలుపు తియ్యి లలితా. నీతో మాట్లాడాలి" అన్నాను.

"ఏంటో అక్కడ్నుంచే మాట్లాడు. సినిమాలూ, టీవీలూ నాకు తెలుసు. నువ్వు దూరంగా వెళ్లిపో. లేదంటే గోల చేసి మావాళ్లని పిలుస్తా" అంది లలిత.

"సరేలే మరదలా. కోవాలా వున్నావు. నిన్ను టేస్ట్ చేయకుండా వదిలిపెట్టనులే" అంటూ అక్కడ్నించి వెళ్లిపోయాను. ఆ తరువాత లలిత తన తల్లిదండ్రులకు ఈ విషయాలన్నీ చెప్పి నా భరతం పడుతుందని అనుకున్నాగానీ అలాంటిదేమీ జరగలేదు. లలిత అనుక్షణం నన్ను గమనిస్తూ లేడిలా నన్ను తప్పించుకు తిరుగుతోంది. ఎక్కడా ఒంటరిగా దొరికే ఛాన్సు ఇవ్వడంలేదు. అప్పటికి నా మనసులో వున్నదొక్కటే ఆశయం. జాంపండులా ఊరిస్తున్న అందాలతో నన్ను పిచ్చివాడిని చేస్తున్న లలిత విరిసీ విరియని సోయగాల సంపదని బావ అనే వరుస చాటున నలిపేసి దాహం తీర్చుకోవాలనే. ఇంక వదలకూడదు. లలితని టచ్ చేయకుండా పోవడానికి వీల్లేదు అని నిశ్చయించుకున్నాను. ఆరోజు లలిత తమ్ముడు బాబిగాడికి చాక్లెట్లు కొనిపెట్టి మచ్చిక చేసుకున్నాను. వాడు నా పార్టీ అయిపోగానే వాడి చెవిలో వూదాను "నువ్వు నీ అక్క ఫ్రెండు సాగరి పిలుస్తోందని, తనని ఇంటి వెనుకనున్న మొక్కజొన్న చేను వద్దకు తీసుకురా అంతే."

వాడు సరేనన్నాడు. ఈలోగా సాగరిని కలసి "లలిత నీకోసం వస్తానంది. నిన్నింట్లోనే ఉండమని చెప్పింది" అన్నాను. ఫినిష్! సాయంత్రం అయిదవుతోంది. పల్లెలో అంతటా ప్రశాంతంగా వుంది.

నేను గుట్టు చప్పుడు కాకుండా మొక్కజొన్న చేనులోకి వెళ్లాను. చేను ఏపుగా పెరిగి వుంది. కంకులు భారంగా గాలికి చిన్నగా వూగుతున్నాయి. బాబిగాడు లలితను తీసుకుని ఇంటి వెనుక భాగానికి చేరాడు. కూతవేటు దూరంలో నిలబడి చూస్తున్నాను మొక్కలచాటున.

వాడు ఏదో చెబుతున్నాడు. లలిత సంశయంగా చూస్తోంది. వాడు ఆమె చెయ్యిపట్టి లాగుతూ ఉన్నాడు. ఆమె కోపంగా వాడివంక చూస్తోంది. అంతలో పట్టా గొలుసుల అలికిడి అయి పక్కకి తిరిగి చూసాను. సాగరి! ఆశ్చర్యపోయాను.

"అదేంటి! నిన్నింట్లోకదా ఉండమన్నాను" అన్నాను.

"ఎందుకో తెలుసుకుందామనే బయలుదేరాను" అంది అదోలా చూస్తూ.

"అదీ...అదీ లలిత చెప్పింది" తడబడ్డాను.

"అబద్ధం కదూ. మొక్కజొన్న చేనులో దాక్కుని వున్నావు. అక్కడ చూస్తే లలిత..ఇందులో ఏదో తిరకాసు వుంది కదూ!"

నేను తనవంక విస్మయంగా చూశాను.

సాగరి నా చేయి పట్టుకుని ఒక్క ఉదుటున లాగింది. అనుకోని ఈ పరిణామానికి తట్టుకోలేక గభాల్న తనమీద పడిపోయాను. మొక్కల మధ్య నేలపై రాలిన సాగరి- ఏపుగా పెరిగిన జొన్నకంకి చేనులా తన నిండైన అందాల గని వంటి మేని పాన్పుపై నేను. ఒకరికొకరం మరీ మరీ దగ్గరగా అతుక్కుపోతూ. సాగరి నన్ను తన బాహు బంధనాల్లో చిక్కించుకుని తనవైపే అదుముకుంటున్నది ఆత్రంగా, ఆబగా. స్వర్గం పిలవకుండానే దిగి వచ్చినందుకు ఆనందం తట్టుకోలేక గుండె ఆగిపోతుందేమోనన్న భయం నాలో. రెండు చేతులతో తన బిగువైన భుజాలను అదిమిపట్టి ఆమె మొహం మీదకు వంగి ఆ లేత మామిడికాయ వంటి బుగ్గపై గట్టిగా ముద్దు పెట్టుకున్నాను. అంతే! కెవ్వుమని అరిచింది. అరిచింది సాగరి కాదు లలిత. అప్పుడే అక్కడికి వచ్చి ఈ దృశ్యాన్ని చూసిన లలిత అలా అరిచి వెనక్కి తిరిగి పరుగెత్తుతోంది ఇంటివైపు. సాగరి వెంటనే నన్ను వెనక్కి తోసేసి లేచి నిలబడింది. బట్టలు సర్దుకుని తానూ చేలో పడి పరుగెత్తింది. ఇంక నాకేం చేయాలో తోచలేదు. ఇప్పుడేం జరగబోతోంది? అన్నదే అసలు ప్రశ్న. లలిత తాను చూసింది చూసినట్లుగా తన తల్లికి చెప్పేసింది.

ఈ విషయం ఊరంతా వెంటనే పాకిపోలేదు. కారణం లలిత తల్లి. నా మేనత్త కనకమ్మకు నేనంటే అభిమానం. అందువల్ల విషయం గుట్టుగానే ఉండిపోయినా ఆమె భర్త చెవిన వేయకుండా ఉండలేకపోయింది. ఆయన వీరభద్రుడు. కానీ ఏం చేయగలడు? ఇప్పుడేం జరిగింది కనుక? నా కాళ్ళు పట్టుకుని, నన్ను అర్థించి తన కూతుర్ని పెళ్లి చేసుకొమ్మని కాళ్లావేళ్లా పడాల్సినవాడు నన్నేమనగలడు? ఇదే భరోసా! మరునాడు ఉదయం వీరభద్రుడు నన్ను రమ్మంటున్నాడని వర్తమానం వచ్చింది. ఎనిమిదింటికల్లా స్నానం చేసి మంచి బట్టలు వేసుకుని హీరోలా తయారై హాల్లోకి వెళ్లాను. హాల్లో ఎవరూ లేరు. అంతలో వీరభద్రుడు అంటే మా మామగారు అక్కడికి వచ్చారు.

"ఏమిటలా పిచ్చి చూపులు చూస్తున్నావు?"

నా దిమ్మ తిరిగిపోయింది.

"అమ్మాయ్ లలితా! ఇలారా"

నిజానికి వీరభద్రుడు భయంకరాకారం ఏమీ కాదు. మామూలు పర్సనాలిటీయే. కానీ దర్పం అధికం. లలిత పరుగెత్తుకుంటూ వచ్చి గడప దగ్గర నిల్చుంది. నాకు గుండెల్లో వణుకు పుట్టింది.

"అసలేమనుకుంటున్నావు నువ్వు? ఏంటి నీ ఉద్దేశ్యం?" అడిగాడు కుర్చీలో కూర్చుంటూ.

"ఏముంది మామయ్యా ఏదో సరదాగా జోక్ చేశానంతే" అన్నాను నీళ్ళు నములుతూ.

"జోకా? నా కూతుర్ని ఏం చేస్తానన్నావ్?"

"అదీ...అదీ వూరికే ఏడిపించడానికి."

"నిన్న బాబిగాడితో ఆడిన నాటకం ఏమిటి?"

"వూరికే సరదాగా అల్లరి చేద్దామని..."

"అలాగా... పెళ్లి చేసుకుంటావా?"

"ఎవర్ని?"

"ఎవర్ని చేసుకుంటావు? లలితనా? సాగరినా?"

"ఇప్పుడిప్పుడే పెళ్లేంటి?" అన్నాను.

"మరి ఇదంతా ఏమిటి? టైంపాసా?"

"కాదు సరదాకి."

"చంపేస్తాను. ఒరేయ్ నువ్వు నాకు వరుసకు ఏమవుతావని నేను ఆలోచించను. నేను నాకోసం జీవిస్తున్నాను. నా ప్రాణంలో ప్రాణం నా కూతురు కోసం జీవిస్తున్నాను. తనని అగౌరవపరచి మానసికంగా హింసించడమే కాకుండా నాటకాలాడి దాని బతుకు పాడు చేయాలనుకుంటున్నావ్రా? ఒరేయ్.. ఇంకోసారి ఈ వూరివైపు వచ్చావంటే మర్యాద దక్కదు. వెళ్ళు" అరిచాడు.

అంతే! నా అభిమానం దెబ్బతింది. నా ఆత్మగౌరవం చచ్చిపోయింది. ఆత్మగౌరవం చచ్చిపోతే మనిషి చచ్చిపోయినట్టు కాదా? నా బతుకు చెప్పరాని విధంగా డిస్టర్బ్ అయిపోయింది. నాపై నాకే అసహ్యం పెరిగిపోయింది. నేను మంచివాడిని కాదేమో అనే అనుమానం ప్రతిక్షణం నన్ను వెంటాడి వేధిస్తోంది. ఇల్లు వదిలి అందర్నీ వదిలి ఎక్కడెక్కడో తిరిగాను. కానీ నేడు ఇంక నాలో ఓపి కలేదు. నేనిక ఏమాత్రం సహించలేను. ఈ ఆలోచనల హోరు, జ్ఞాపకాల జోరుని నేను తట్టుకోలేను.

రైలెక్కి ఆ వూరికి బయలుదేరాను. ఆ వూరు వచ్చేదాకా రకరకాలుగా ఆలోచిస్తూ గడిపాను. వూరు వచ్చేసింది. రాత్రి ఎనిమిది అయింది. బండి దిగాను. స్టేషన్‌లోంచి బయటకొచ్చి లలిత ఇంటి వైపు నడుస్తున్నాను. ముప్పయి ఏళ్ల వయస్సుకే ముసలాడ్నయిపోయిన అనుభూతి. పదేళ్ల తరువాత ఈ వూరికొస్తున్నాను. మదిలో ఒకటే ఉత్కంఠత, గాబరా. లలిత ఇంటికెళ్లి తలుపు తట్టాను.

తలుపు తెరిచిన లలిత నన్ను మొదట పోల్చుకోలేకపోయింది. పెరిగిన గడ్డం, లుంగీ, కాషాయ రంగు లాల్చీ ఎవరో సాధువు వేషం వేసిన బిచ్చగాడు కాబోలనుకుంది.

కానీ ఆమె అనుమానాల్ని పసిగట్టి వెంటనే "లలితా! నేను నీ బావని" అన్నాను.

తను వెంటనే నా మొహంలోకి తేరిపార చూసి "బావా! నువ్వా! రా...రా" అంటూ స్వాగతం పలికింది. లోపలికెళ్లాను.

తన పిల్లలు ఇద్దరూ అమ్మాయిలే. వాళ్లనీ, తన భర్తనీ పరిచయం చేసింది. తన భర్తతో అంది-

"మా అత్తయ్య కొడుకండీ. చాలా మంచి వ్యక్తి. చిన్నతనంలోనే బాగా డిస్టర్బ్ అయి వూరొదిలి వెళ్లిపోయాడు. ఇన్నాళ్ళూ ఎక్కడున్నాడో తెలీదు. పాపం అతని తల్లిదండ్రులు ఆయనకోసం కుమిలిపోతున్నారు."

ఈ మాటలు వినగానే నాలో రక్తం జివ్వున పొంగింది. చటుక్కున లేచి అక్కడ్నించి బయటకి వచ్చేసాను. దారిలోనే సాగరి ఇల్లు. సాగరి ఇంటి గుమ్మంలో కూర్చుని తన పిల్లలతో ఆడుకుంటోంది.

"సాగరీ!" గొణిగాను.

తను నన్ను గుర్తుపట్టింది.

"మీరా? ఏంటిలా అయిపోయారు. అయ్యయ్యో ఇల్లు వదిలేసి దేశాలు పట్టిపోయారని విన్నాను. ఎందుకలా? మీవాళ్ళని కలిసారా?" అంది చంటిపిల్లాడ్ని ఎత్తుకుంటూ.

అసహ్యంగా అనిపించింది. తనపై కాదు.. నాపై నాకే అసహ్యంగా. అజ్ఞానం.. చిన్న విషయాలని భూతద్దంలో చూసుకుని విలువైన జీవితాన్ని పాడు చేసుకున్నాను. ఏది పాపం? ఏది అధర్మం? ఏది అనైతికత? వయసు ఎప్పుడూ అజ్ఞానాన్ని సూచిస్తుంది. మనిషి ఎదిగితే మనసూ ఎదుగుతుంది. దూరంగా వెళ్లినకొద్దీ ప్రయాణం విలువ తెలుస్తుంది. అమ్మా.. నాన్నా.. నేను వచ్చేస్తున్నాను. మీకోసం.. నాకోసం వచ్చేస్తున్నాను. ఈరోజు నిజం తెలిసిన మనిషిగా మీ దగ్గరికి వచ్చేస్తున్నాను.

ఇక ఈ పయనం ఆగదు...

★

